# 1.82 లక్షల కోట్లకు జీఎస్టీ వసూళ్లు

- **జూలై నెలలో 10 శాతం వృద్ధి**

న్యూఢిల్లీ, ఆగస్టు 1: జీఎస్టీ వసూళ్లు మరింత పెరిగాయి. జూలై నెలకుగాను రూ.1.82 లక్షల కోట్ల వసూలైనట్లు కేంద్ర ప్రభుత్వం అధికారికంగా విడుదల చేసిన నివేదిక వెల్లడించింది. అంతక్రితం ఏడాది ఇదే నెలలో వసూలైనదాంతో పోలిస్తే 10 శాతం అధికం. జీఎస్టీ అమలులోకి వచ్చిన తర్వాత మూడో అతిపెద్ద వసూలు ఇదే కావడం విశేషం. అలాగే రూ.16,283 కోట్లు రిఫండ్ రూపంలో చెల్లింపులు జరిపింది. నికరంగా లెక్కిస్తే రిఫండ్ చెల్లింపులు జరిపిన తర్వాత రూ.1.66 లక్షల కోట్లు జీఎస్టీ వసూలయ్యాయి. మరోవైపు, ఏప్రిల్‌లో వసూలైన రూ.2.10 లక్షల కోట్లు జీఎస్టీ చరిత్రలో అత్యధిక వసూళ్లు ఇదే కావడం విశేషం. గత నెలకుగాను వసూలైన రూ.1,82,075 కోట్లలో సెంట్రల్ జీఎస్టీ కింద రూ.32,386 కోట్లు వసూలవగా, స్టేట్ జీఎస్టీ కింద రూ.40,289 కోట్లు, ఐజీఎస్టీ కింద రూ.96,477 కోట్లు వసూలయ్యాయి.





### తెలంగాణలో 4,940 కోట్లు

తెలంగాణ రాష్ట్రంలో జీఎస్టీ వసూళ్లు మరింత పెరిగాయి. గత నెలకుగాను రూ.4,940 కోట్ల మేర వసూలయ్యాయని పేర్కొంది. క్రితం ఏడాది ఇదే నెలలో వసూలైనదాంతో రూ.4,849 కోట్లతో పోలిస్తే ఇది 2 శాతం అధికం. అలాగే ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం జీఎస్టీ వసూళ్లు ఏడాది ప్రాతిపదికన 7 శాతం తగ్గి రూ.3,593 కోట్ల నుంచి రూ.3,346 కోట్లకు తగ్గాయి.

# బ్యాంక్ ఉద్యోగాలు మాయం

## డిజిటలైజేషన్‌తో కనుమరుగవుతున్న క్లర్క్ కొలువులు

## ఏఐ రాకతో మరిన్ని కోతలకు ఆస్కారం




న్యూఢిల్లీ, ఆగస్టు 1: నానాటికీ పెరుగుతున్న సాంకేతిక పరిజ్ఞానం.. ఆర్థిక రంగంలో పెను మార్పులనే తెస్తున్నది. ముఖ్యంగా విస్తరిస్తున్న డిజిటలైజేషన్, ఆటోమేషన్ ప్రభావం దేశీయ బ్యాంకింగ్ రంగంపై స్పష్టంగా కనిపిస్తున్నది. ఈ క్రమంలోనే పెద్ద ఎత్తున జరుగుతున్న కంప్యూటరీకరణతో బ్యాంకుల్లో మధ్య, దిగువ శ్రేణి క్లరికల్ ఉద్యోగాలు కనుమరుగైపోతున్నాయి. అవును.. 2010-11 ఆర్థిక సంవత్సరంలో బ్యాంకింగ్ రంగంలో అధికారులు, వారి సహాయక సిబ్బంది నడుమ నిష్పత్తి 50:50గా ఉన్నది. 2022-23 ఆర్థిక సంవత్సరం వచ్చేసరికి 74:26గా ఉండటంతో బ్యాంకుల్లో వేగంగా చోటుచేసుకుంటున్న మార్పులకు ఇది అద్దం పడుతున్నది. ఈ నేపథ్యంలో కృత్రిమ మేధస్సు (ఏఐ) రాకతో బ్యాంకుల్లో ఉద్యోగావకాశాలు మరింతగా సన్నగిల్లుతాయన్న ఆందోళనలు ఇప్పుడు అంతటా వ్యక్తమవుతున్నాయి.

**ఆర్బీఐ నివేదికలో..**

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) ఇచ్చిన నివేదికలో 2013 నుంచి 2019 వరకు అంతర్జాతీయంగా ఆర్థిక రంగంలో సహాయక సిబ్బంది సంఖ్య తగ్గిపోయినట్టు తేలింది. ఇదే సమయంలో నిపుణులు, సాంకేతిక సిబ్బంది సంఖ్య పెరిగినట్టు కనిపించడం గమనార్హం. భారత్‌లోనూ ఇదే పరిస్థితి. మరో వైపు 2022-23 ఆర్థిక సంవత్సరంలో ప్రైవేట్ బ్యాంకుల టర్నోవర్ రేటు 30 శాతం పెరిగింది. డిజిటల్ వేదికల ద్వారా చేపట్టిన నియామకాలే ఇందుకు కారణమని ఆర్బీఐ రిపోర్ట్ చెప్పడం విశేషం. 'దేశీయ లేబర్ మార్కెట్‌లో ఏఐ ఆధారిత నైపుణ్యాల ప్రాముఖ్యత పెరిగింది. గత ఏడాది జరిగిన మొత్తం నియామకాల్లో ఏఐ ప్రతిభ కలిగినవారి వాటా 16.8 శాతంగా ఉండటమే దీనికి నిదర్శనం. మునుపెన్నడూ ఈ స్థాయిలో లేదిది' అని ఆర్బీఐ నివేదిక చెప్పింది.

**డిజిటల్ విప్లవం**

దేశంలో డిజిటల్ విప్లవం వేగంగా జరుగుతున్నది. ఈ క్రమంలోనే 2026కల్లా భారత జీడీపీలో డిజిటల్ ఎకానమీ వాటా 20 శాతానికి చేరగలదన్న అంచనాలున్నాయి. ఇప్పుడు 10 శాతంగానే ఉన్నదిది. తర్వాతితరం బ్యాంకింగ్, మెరుగైన ఆర్థిక సేవలను తక్కువ ఖర్చుతోనే అందించడానికి డిజిటలైజేషన్ దోహదం చేస్తున్నదని ఆర్బీఐ గవర్నర్ దాస్ అంటున్నారు. అయితే ఉద్యోగ వ్యవస్థను కాపాడుకోవడం కూడా ముఖ్యమేనన్న అభిప్రాయాన్ని ఆయన వ్యక్తం చేస్తున్నారు. నిజానికి ఒకప్పటితో పోల్చితే ఇప్పుడు బ్యాంకుల్లో ఎక్కడ చూసినా డిజిటల్ సేవలు కనిపిస్తున్నాయి. నగదు డిపాజిట్లు, విత్‌డ్రాలు ఉద్యోగుల ప్రమేయం లేకుండానే జరిగిపోతున్నాయి. గూగుల్ పే, ఫోన్‌పే వంటి పేమెంట్స్ యాప్‌లు వచ్చాక చాలామంది బ్యాంకులకు వెళ్లడం మానేశారు. పాస్‌బుక్ ప్రింటింగ్‌లూ కియోస్కుల ద్వారా జరిగిపోతున్నాయి. దీంతో ఒకప్పుడు ఈ పనుల నిర్వహణకు అవసరమైన సిబ్బంది.. నేడు అక్కర్లేకుండాపోయారు.

**సైబర్ మోసాలతో ముప్పు**

టెక్నాలజీతో ఎంతైతే మంచి జరుగుతున్నదో.. దాన్ని ఆసరాగా చేసుకుని సైబర్ మోసగాళ్లూ అంతే చెడుకు పాల్పడుతుండటం ఆందోళన కలిగిస్తున్నది. పెరుగుతున్న సైబర్ మోసాలపట్ల అప్రమత్తంగా ఉండాలని ఆర్బీఐ అటు బ్యాంకింగ్, బ్యాంకింగేతర ఆర్థిక సంస్థలను.. ఇటు ఖాతాదారులను ఎప్పటికప్పుడు హెచ్చరిస్తున్నది చూస్తూనే ఉన్నాం. 2019-20 నుంచి 2022-23 ఆర్థిక సంవత్సరాల్లో డాటా చౌర్యం విలువ 28 శాతం ఎగిసి 2 మిలియన్ డాలర్లకు చేరినట్టు చెప్తున్నారు. సైబర్ రిస్కులు ముఖ్యంగా ఫిషింగ్ దాడులు పెరిగిపోయాయి. దీంతో ఖాతాదారుల విలువైన సమాచారం మోసగాళ్ల బారిన పడుతున్నది. అందుకే అనామక కాల్స్, మెసేజ్‌లకు స్పందించవద్దని, తెలియని లింక్స్‌పై క్లిక్ చేయవద్దని బ్యాంకులతోపాటు పోలీసులూ హెచ్చరిస్తున్నారు. అయినా అమాయకులు మోసపోతూనే ఉన్నారు.



*ఆర్థిక రంగంలో శ్రామిక శక్తిని ఔట్‌సోర్సింగ్, టెలీవర్క్ ద్వారా డిజిటలైజేషన్ వికేంద్రీకరిస్తున్నది. ఉద్యోగుల స్థానంలో ఆటోమేషన్ వచ్చేస్తున్నది. దీనివల్ల జాబ్ మార్కెట్.. తక్కువ నైపుణ్యం ఉన్నవారికి తక్కువ వేతనం/ ఎక్కువ నైపుణ్యం ఉన్న వారికి ఎక్కువ వేతనం అన్నట్టుగా తయారైంది. ఇక మధ్యస్థాయి ఉద్యోగులనైతే టెక్నాలజీ భర్తీ చేసేస్తున్నది.*

*-శక్తికాంత దాస్, ఆర్బీఐ గవర్నర్*

# నిఫ్టీ@25,011

## ఈ స్థాయిలో ముగియడం ఇదే తొలిసారి

## ఇంట్రా-డేలో 82,000 మార్కును దాటిన సెన్సెక్స్




ముంబై, ఆగస్టు 1: దేశీయ స్టాక్ మార్కెట్లు వరుస రికార్డులతో హోరెత్తిస్తున్నాయి. ఈ క్రమంలోనే నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ తొలిసారి 25,000 మార్కును అధిగమించింది. గురువారం 59.75 పాయింట్లు లేదా 0.24 శాతం పెరిగి మునుపెన్నడూ లేనివిధంగా 25,010.90 వద్ద నిలిచింది. ఒకానొక దశలో 25,078.30 స్థాయిని తాక డం గమనార్హం. నిఫ్టీకి ఇదే ఆల్‌టైమ్ ఇంట్రా-డే హై. ఇక బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 126.21 పాయింట్లు లేదా 0.15 శాతం పుంజుకొని ఆల్‌టైమ్ హై రికార్డును నెలకొల్పుతూ 81,867.55 వద్ద స్థిరపడింది. ఇంట్రా-డేలోనైతే 82,000 మార్కును దాటి గతంలో ఎన్నడూలేనివిధంగా 82,129.49 స్థాయిని అందుకోవడం విశేషం.

**ఫెడ్ రిజర్వ్ సంకేతాలతో..**

సెప్టెంబర్‌లో వడ్డీరేట్లు తగ్గుతాయన్న సంకేతాలు అమెరికా ఫెడరల్ రిజర్వ్ బ్యాంక్ నుంచి రావడం.. మదుపరులను పెట్టుబడులవైపునకు నడిపించింది. ఈ క్రమంలోనే యుటిలిటీస్, పవర్, చమురు-గ్యాస్, మెటల్ రంగాల షేర్లు పరుగులు పెట్టాయి. బీఎస్ఈ స్మాల్‌క్యాప్ 0.70 శాతం, మిడ్‌క్యాప్ 0.80 శాతం చొప్పున పెరిగాయి. ఒకానొక దశలో మిడ్‌క్యాప్ సూచీ ఆల్‌టైమ్ హై స్థాయికి వెళ్లింది. షేర్లవారీగా చూస్తే.. పవర్ గ్రిడ్, ఎన్టీపీసీ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, నెస్లే ఇండియా, అదానీ పోర్ట్స్ సెజ్, మారుతీ సుజుకీ, రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్లు పెద్ద ఎత్తున లాభపడ్డాయి.

**గ్లోబల్ మార్కెట్లలో..**

ప్రధాన ఆసియా మార్కెట్లలో మిశ్రమ స్పందన కనిపించింది. జపాన్, చైనా, హాంకాంగ్ సూచీలు నష్టపోయాయి. అయితే దక్షిణ కొరియా సూచీ లాభపడింది. మరో వైపు ఐరోపా మార్కెట్లు బలహీనంగా ట్రేడ్ అవుతున్నాయి. అయినప్పటికీ అమెరికా ఫెడ్ రిజర్వ్ జోష్‌తో భారతీయ స్టాక్ మార్కెట్లు లాభాలను అందుకోగలిగాయి.

# ఆటో అమ్మకాలు అంతంతే

- **జూలైలో తగ్గిన వాహన డిమాండ్**

న్యూఢిల్లీ, ఆగస్టు 1: దేశీయంగా వాహన అమ్మకాలు క్రితంతో పోల్చితే గత నెలలో పడిపోయాయి. ప్రధాన సంస్థలైన మారుతీ సుజుకీ, టాటా మోటర్స్, హ్యుందాయ్ విక్రయాల్లో క్షీణత నమోదైంది. జూలైలో మారుతీ 9.64 శాతం, టాటా 11 శాతం, హ్యుందాయ్ 3 శాతం మేర తక్కువ సేల్స్‌ను చూశాయి. మార్కెట్ లీడర్ మారుతీ సుజుకీకి చెందిన ఎవర్‌గ్రీన్ మాడల్ ఆల్టోతోపాటు, ఎస్-ప్రెస్సో మాడళ్లకు కొనుగోళ్ల మద్దతు లభించినా.. పాపులర్ మాడల్స్ బాలెనో, సెలీరియో, డిజైర్, స్విఫ్ట్, వాగనార్‌లకు ఆదరణ తగ్గింది. యుటిలిటీ వెహికిల్స్ బ్రెజ్జా, ఎర్టిగా, ఎక్స్ఎల్6, గ్రాండ్ విటారా, జిమ్నీ అమ్మకాలూ అంతంతే ఉండటం గమనార్హం. అయితే మహీంద్రా అండ్ మహీంద్రా, టయోట, కియా అమ్మకాలు పెరిగాయి. టూవీలర్ సేల్స్‌లోనూ మిశ్రమ ఫలితాలు వచ్చాయి.

**జూలైలో దేశీయ వాహన విక్రయాలు (యూనిట్లలో)**

| సంస్థ | 2023 | 2024 |
|---|---|---|
| మారుతీ సుజుకీ | 1,52,126 | 1,37,463 |
| టాటా మోటర్స్ | 78,844 | 70,161 |
| హ్యుందాయ్ | 50,701 | 49,013 |
| మహీంద్రా | 36,205 | 41,623 |
| టయోట | 21,911 | 31,656 |
| కియా | 20,002 | 20,507 |
| హోండా కార్స్ | 4,864 | 4,624 |
| హోండా మోటర్‌సైకిల్ | - | 4,39,118 |
| బజాజ్ ఆటో | 1,79,263 | 2,10,997 |
| టీవీఎస్ మోటర్ | 2,35,230 | 2,54,250 |
| రాయల్ ఎన్‌ఫీల్డ్ | 73,117 | 67,265 |
| అశోక్ లేలాండ్ | 15,068 | 13,928 |



## అమర రాజాతో ఏథర్ జట్టు

న్యూఢిల్లీ, ఆగస్టు 1: బ్యాటరీ సెల్స్ తయారీ, సరఫరా కోసం ప్రముఖ ఈవీల తయారీ సంస్థ ఏథర్ ఎనర్జీ తాజాగా అమర రాజా అడ్వాన్స్ సెల్ టెక్నాలజీతో జట్టుకట్టింది.ఈ ఒప్పందంలో భాగంగా ఎన్ఎంసీ(నికెల్ మాంగనీస్ కోబాల్ట్), ఎల్ఎఫ్‌పీ(లిథియం ఐరన్ ఫాస్ఫేట్) లిథియం-అయాన్, ఇతర అడ్వాన్స్‌డ్ కెమిస్ట్రీ సెల్స్‌లను అమర రాజా సరఫరా చేయాల్సి ఉంటుంది.

## హైదరాబాద్-భువనేశ్వర్ మధ్య ఎయిర్‌ఇండియా ఎక్స్‌ప్రెస్ ఫ్లైట్

హైదరాబాద్, ఆగస్టు 1: హైదరాబాద్-భువనేశ్వర్‌ల మధ్య విమాన సర్వీసులను ప్రారంభించింది ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్. హైదరాబాద్‌లో ఉదయం 5.55 గంటలకు బయలుదేరనున్న సర్వీసు భువనేశ్వర్‌కు 7.20 గంటలకు చేరుకోనున్నది. మళ్లీ 8.20 గంటలకు బయలుదేరి హైదరాబాద్‌కు 9.45కి చేరుకోనున్నది.

# పీఎన్‌బీ వడ్డీరేట్ల పెంపు

న్యూఢిల్లీ, ఆగస్టు 1: ప్రభుత్వరంగ సంస్థ పంజాబ్ నేషనల్ బ్యాంక్(పీఎన్‌బీ) వడ్డీరేట్లను స్వల్పంగా పెంచింది. మార్జినల్ కాస్ట్ ఆఫ్ ఫండ్స్-బేస్డ్ లెండింగ్ రేటు(ఎంసీఎల్ఆర్)ని 5 బేసిస్ పాయింట్లు పెంచుతున్నట్లు ప్రకటించింది. దీంతో అన్ని రకాల రుణాలపై వడ్డీరేట్లు మరింత అధికంకానున్నాయి. అత్యధిక మంది వాహన, వ్యక్తిగత రుణాలు తీసుకునే ఏడాది కాలపరిమితి కలిగిన రుణాలపై వడ్డీరేటు 8.90 శాతానికి పెరగనున్నది. అంతకుముందు ఇది 8.85 శాతంగా ఉన్నట్లు పేర్కొంది. అలాగే మూడేండ్ల కాలపరిమితి కలిగిన రుణాలపై ఎంసీఎల్ఆర్ 9.20 శాతానికి పెంచిన బ్యాంక్...నెల, మూడు, ఆరు నెలల రుణాలపై వడ్డీరేట్లు 8.35 శాతం నుంచి 8.55 శాతం మధ్యలో సవరించింది. మరోవైపు, ఏడాది కాలపరిమితి కలిగిన రుణాలపై ఎంసీఎల్ఆర్‌ని 5 బేసిస్ పాయింట్లు పెంచుతున్నట్లు బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రకటించింది.

# ఎన్ఎండీసీ ఉత్పత్తి క్షీణత

న్యూఢిల్లీ, ఆగస్టు 1: దేశంలో అతిపెద్ద ఇనుప ఖనిజ సంస్థ ఎన్ఎండీసీ ఉత్పత్తి 11 శాతం పడిపోయింది. గత నెలకుగాను 2.17 మిలియన్ టన్నుల ఖనిజాన్ని మాత్రమే ఉత్పత్తి చేసింది. అంతక్రితం ఏడాది 2.44 మిలియన్ టన్నుల. అలాగే ఖనిజ అమ్మకాలు 2.91 మిలియన్ టన్నుల నుంచి 3.06 మిలియన్ టన్నులకు పెరిగింది. అలాగే ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి జూలై మధ్య కాలంలో 11.36 మిలియన్ టన్నుల ఖనిజాన్ని ఉత్పత్తి చేయగా, 13.15 మిలియన్ టన్నుల ఖనిజాన్ని విక్రయించింది.




Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481,
Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.